నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అహ్మద్ తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించి కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు రాజీమార్గం ద్వారా లోక్అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడిపికి మూడిందా..?

- మూడు నియోజకవర్గాల్లో నెలకొన్న గ్రూపుల పోరు
- పోటాపోటీ కార్యక్రమాలతో శ్రేణుల్లో గందరగోళం
- వెనకుండి కథ నడిపిస్తున్న పార్టీ పెద్ద!
- వైసిపికి అవకాశం కల్పిస్తున్న కీలక నేత వైఖరి

చింత చచ్చినా పులుపు చావలేదన్న చందంగా ఉంది జిల్లాలో టిడిపి పరిస్థితి. గత సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలకు గాను రెండు చోట్ల మాత్రమే గెలిచి ఘోర ఓటమి చవి చూసింది. నాలుగేళ్లు గడచినా పార్టీ నేతల వైఖరిలో మార్పు కనిపించడం లేదు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అన్ని స్థానాల్లో గెలిచి అధికారంలోకి వస్తుందంటూ శ్రేణుల్లో ఉత్తేజం నింపుతున్న పార్టీ పెద్దలు క్షేత్రస్థాయిలో మాత్రం సైకిల్‌కు గాలి తీసే పనులు చేస్తుండటమే అందుకు కారణం.

ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల్లో టిడిపి పరిస్థితి రోజురోజుకీ ఇబ్బందికరంగా మారుతోంది. ఆయా నియోజకవర్గాల్లో టికెట్ల కోసం పోటీ పడుతున్న ఆశావహులు పోటాపోటీ కార్యక్రమాలు చేస్తూ నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు తలనొప్పిగా మారారు. పార్టీలో నెలకొన్న గ్రూపుల పోరు, అనైక్యతను సరిదిద్దాల్సిన నేతలే ఆశావహులను వెనుకుండి నడిపిస్తున్నారంటూ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు లోలోపల మండిపడుతున్నారు.

శ్రీకాకుళం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి గత సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా అధిష్టానం అప్పగించిన బాధ్యతలను, కార్యక్రమాలను చూస్తున్నారు. పార్టీ ఘోర ఓటమి తర్వాత చాలా నియోజకవర్గాల్లో నేతలు బయటకు రాని రోజుల్లోనూ పార్టీ పిలుపులకు అనుగుణంగా నిరసనలు, ధర్నాలు చేపట్టారు. రాబోవు ఎన్నికల్లోనూ గుండ కుటుంబం తప్ప నియోజకవర్గంలో ఇంకెవరున్నారంటూ పార్టీ నాయకులు ఇటీవల వరకు ధీమాగా ఉన్నారు. శ్రీకాకుళం మండలం కిష్టప్పపేటకు చెందిన యువనాయకుడు గొండు శంకర్ పరామర్శలు, పార్టీ కార్యక్రమాలు, అన్నా కేంటీన్ నిర్వహణ వంటి కార్యక్రమాలు పోటీగా సాగిస్తున్నారు. యువతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న పార్టీ నిర్ణయం మేరకు శ్రీకాకుళం అసెంబ్లీ స్థానానికి తన పేరును పరిశీలించాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌కు సైతం దరఖాస్తు సమర్పించారు. యువనేతగా చెప్పుకోవడమే తప్ప శంకర్‌కు ఉన్న బలమేమిటని, ధర్మానకు పోటీ ఇచ్చే స్థాయి ఆయనకు లేదంటూ నియోజకవర్గ నాయకులు కొట్టి పారేస్తున్నారు. యువనేత శంకర్ బలాన్ని కొట్టి పారేసినా ఎంతో కొంత నష్టం ఉండక మానదు. ఇది ఏ రకంగా చూసుకున్నా లక్ష్మీదేవి గెలుపునకు ఇబ్బందిగా పరిణమించనుంది. పార్టీ అధికారంలోకి వస్తే తను హోం మంత్రి కావాలని ఆశిస్తున్న నేత సరిగ్గా ఇదే కోరుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో గుండ లక్ష్మీదేవి గెలిస్తే బిసి సామాజిక తరగతి, రెండు సార్లు గెలిచిన ఎమ్మెల్యే, మహిళ కేటగిరిలో ఆమెకు మంత్రి పదవి రావొచ్చనే అంచనాతో ఆ నేతే ముందస్తు చిచ్చు పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అందులో భాగంగానే శంకర్‌ను ఎగదోస్తున్నారని నియోజకవర్గంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. టిడిపి అధికారంలోకి రావాలి, చంద్రబాబు సిఎం కావాలని కోరుకుంటున్న పెద్దాయన ఇక్కడ మాత్రం గుండ కుటుంబం గెలవకూడదని భావిస్తున్నట్లుగా ఉందని పలువురు నాయకులు ఆరోపిస్తున్నారు. గొండు శంకర్ వ్యవహారంతో నియోజకవర్గంలో నెలకొన్న ఇబ్బందికరమైన పరిస్థితులు, అసంతృప్తులను చక్కదిద్దడంపై ఏనాడూ దృష్టి పెట్టకపోవడం అందులో భాగమేనా? అని టిడిపి నాయకులు అనుకుంటున్నారు. గుండ లక్ష్మీదేవిని నియోజకవర్గంలో బలహీనపరచడం ద్వారా టిడిపి పెద్దలు రెవెన్యూ మంత్రి ధర్మాన గెలుపునకు ఎప్పటి మాదిరిగానే సహకరిస్తున్నట్లుగా ఉందంటూ పార్టీ శ్రేణుల్లో చర్చ నడుస్తోంది.

ఎచ్చెర్లలో కళాకు పొగ

ఎచ్చెర్ల నియోజకవర్గంలోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావుకు పొగపెడుతున్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఆయన కార్యక్రమాలు చేపడుతుండగా, ఆ పార్టీ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు కూడా విడివిడిగా పార్టీ కార్యక్రమాలు చేస్తున్నారు. గ్రామాల్లో పర్యటించడం, నాయకులను కలుసుకోవడం చేస్తున్నారు. నియోజకవర్గంలో టికెట్ ఎవరికి వస్తుందో తెలియని అయోమయం అక్కడ నెలకొంది. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పార్టీ ఒకరిని నియమించిన తర్వాత అదే పార్టీలో మరో నాయకుడు కార్యక్రమాలు చేస్తున్నారంటే కచ్చితంగా పార్టీ పెద్దల ఆశీస్సులు ఎవరివో ఒకరివి ఉండి ఉండాలి. లేకుంటే పార్టీ నిర్ణయానికి భిన్నంగా చేస్తున్న నాయకుడిని ఈపాటికే హెచ్చరించి ఉండాల్సింది. పార్టీ అధిష్టానం కళా వెంకటరావుకు టికెట్‌ను కేటాయిస్తే ఇప్పటివరకు టికెట్‌పై ఆశలు పెట్టుకున్న కలిశెట్టి అప్పలనాయుడు, ఆయన అనుచరులు కళా గెలుపు కోసం పని చేస్తారా? ఇది పార్టీకి నష్టం కాదా? పార్టీ పెద్దలు కోరుకుంటున్నది ఇదేనా అన్న చర్చ నియోజకవర్గంలో సాగుతోంది.

పాతపట్నంలో కలమటకు మంట

పాతపట్నం నియోజకవర్గంలో ఇన్‌ఛార్జి కలమట వెంకటరమణకూ సెగ తగులుతోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయిన తర్వాత నియోకజకవర్గ ఇన్‌ఛార్జిగా పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నారు. అదే నియోజకవర్గానికి చెందిన మామిడి గోవిందరావు సామాజిక కార్యక్రమాల పేరుతో నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పోటా పోటీ కార్యక్రమాలు నిర్వహిస్తూ తనకే టిడిపి టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. తనకు టికెట్ రాకుంటే స్వతంత్రంగానైనా పోటీ చేస్తానంటూ అనుచరుల వద్ద చెప్తున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే అక్కడ కూడా పార్టీకి నష్టం కలగకమానదు. అక్కడ కూడా పార్టీని చక్కదిద్దే పనికి పూనుకోవడం లేదు. సార్వత్రిక ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే ఉన్న నేపథ్యంలో మూడు నియోజకవర్గాల్లో నెలకొన్న ఇబ్బందికర పరిణామాలను చక్కదిద్దకుంటే గత సార్వత్రిక ఎన్నికల నాటి ఫలితాలే పునరావృతమవుతాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

పని చేయలేకపోతే వెళ్లిపోవచ్చు

- కనీస ఇంగితజ్ఞానం లేకుండా డ్యూటీలు చేస్తున్నారు
- వైద్యులు, అధికారులపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆగ్రహం

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి

పిహెచ్‌సిలకు వస్తున్న రోగుల వివరాల నమోదులో వైద్యులు చాలా నిర్లక్ష్యంగా ఉంటున్నారని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం జెడ్‌పి సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. యాప్‌లో రోగుల వివరాల నమోదులో రాష్ట్రంలో జిల్లా పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. జిల్లాలో మెట్టక్కివలస, బెల్లుపడ పిహెచ్‌సిలో నమోదు శాతం అట్టడుగున ఉండటంపై సంబంధిత వైద్యులను నిలదీశారు. దీనిపై పలు కారణాలు చెప్పిన వైద్యులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో వందశాతం నమోదు చేసిన పిహెచ్‌సిల్లో ఎదురుకాని సమస్యలు మీ దగ్గరే ఎందుకున్నాయంటూ సమాధానం చెప్పాలన్నారు. అర్బన్ పిహెచ్‌సిల్లో వైద్యులు లేనిచోట ఇన్‌చార్జులను నియమించక పోవడంపై ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.ప్రకాశరావుపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు లేకుండా పిహెచ్‌సి ఉందంటే మీరు నిద్ర పోతున్నారా? అని ప్రశ్నించారు. బాధ్యతతో పని చేస్తేనే ఉండాలని లేకపోతే వెళ్లిపోవాలన్నారు. డిఎంహెచ్ఒ, పిఒ ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఒకానొక దశలో పిఒ ప్రకాశరావును సస్పెండ్ చేయాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీజస్ (ఎన్‌సిడి) సర్వేలోనూ జిల్లా వెనుకబడిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. నందిగాం, సిరిపురం పిహెచ్‌సిలు, శ్రీకాకుళం నగరంలోని ఆదివారంపేట, డిసిసిబి కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్లు సర్వేలో వెనుకబాటుకు కారణాలు చెప్పాలని సంబంధిత వైద్యులను నిలదీశారు. ఈ నెల 19న మరోసారి సమీక్ష నిర్వహిస్తామని అట్టడుగున ఉన్న ఐదారు పిహెచ్‌సిల వైద్యులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు వైద్యాధికారులు ప్రతిరోజు విధిగా వారికి కేటాయించిన ఆరోగ్య కేంద్రాల్లో ఫేసియల్ రికగ్నేషన్ ద్వారా హాజరు వేయాలని ఆదేశించారు. పిహెచ్‌సిల్లో కింది స్థాయి సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధులకు సరిగా హాజరవ్వని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ స్థాయి నుంచి మండల స్థాయి వరకు వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ, సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదుల కోసం 1902 నంబరును ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. ఫిర్యాదుల సమాచారం తమకే వస్తుందని, వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరించాలని చెప్పారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను జిల్లాలోని అన్ని మండలాల్లో సక్రమంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ సచివాలయం వారీగా జనాభాను పరిగణలోకి తీసుకుని వయస్సుల వారిగా వివిధ రకాల ఆరోగ్య సమస్యలను గుర్తించాలన్నారు. ఎఎన్ఎం, ఆశ, సిహెచ్ఒలతో ప్రతివారం సమావేశం ఏర్పాటు చేసుకొని ఆరోగ్య కేంద్రాల పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేయాలని ఆదేశించారు. మాత, శిశు మరణాల సంఖ్యను తగ్గించడం, 104 వాహనాల షెడ్యూలు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు, ఆయుష్మాన్ భారత్ అమలు తదితర ప్రక్రియలను చేపట్టడంలో ప్రతిఒక్కరూ మంచిపనితీరు కనబరచాలన్నారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి, డిప్యూటీ డిఎంహెచ్ఒ అనురాధ, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, అర్బన్ మెడికల్ ఆఫీసర్ జంపు కృష్ణమోహన్, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ ప్రకాశరావు, పిహెచ్‌సి, యుహెచ్‌సి వైద్యులు పాల్గొన్నారు.

ఎసిబి వలలో వర్క్ఇన్‌స్పెక్టర్

రూ.13 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

ప్రజాశక్తి- లావేరు

లంచం తీసుకుంటూ పట్టుబడిన వర్క్ ఇన్‌స్పెక్టర్ మజ్జి కన్నంనాయుడు

ఎసిబి వలకు అవినీతి చేప చిక్కింది. ఇంటి బిల్లు కోసం లబ్ధిదారుని నుంచి హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. ఈ సంఘటన శుక్రవారం లావేరు మండలంలో చోటుచేసుకుంది. ఎసిబి డిఎస్‌పి బివిఎస్ఎస్ రమణమూర్తి కథనం ప్రకారం...

లావేరు మండలంలోని గుమ్మడం పంచాయతీ వాళ్లేపేట గ్రామానికి చెందిన రైతు కిల్లారి కృష్ణకు ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసింది. మొదటి బిల్లు రూ.1.50 లక్షలు ఇదివరకే మంజూరైంది. తర్వాత ఇంటి నిర్మాణం పూర్తిచేసి, చివరి బిల్లు పెట్టాలని కృష్ణ.. హౌసింగ్ కార్యాలయం చుట్టూ ఏడాదిగా తిరుగుతున్నారు. 'రేపు.. ఎల్లుండూ' అంటూ వర్క్ఇన్‌స్పెక్టర్ మజ్జి కన్నంనాయుడు కాలయాపన చేస్తూ, చివరికి మొదటి బిల్లు చేసినందుకు రూ.13 వేలు లంచం అడిగారు. ఆ మొత్తం చెల్లిస్తేనే చివరి బిల్లు పెడతానని చెప్పారు. దీంతో విసిగిపోయిన కృష్ణ.. ఎసిబి అధికారులను ఆశ్రయించారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో లబ్ధిదారుడు కృష్ణ ఎసిబి అధికారులు ఇచ్చిన నోట్లను గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో వర్క్ఇన్‌స్పెక్టర్ కన్నంనాయుడుకు ఇచ్చారు. వెంటనే అక్కడే మాటువేసి ఉన్న ఎసిబి అధికారులు దాడి చేసి వర్క్ఇన్‌స్పెక్టర్‌ను రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. వర్క్ఇన్‌స్పెక్టర్‌పై కేసు నమోదు చేసి, విశాఖపట్నంలోని ఎసిబి కోర్టులో శనివారం హాజరు పరుస్తామని డిఎస్‌పి రమణమూర్తి తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 1100కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ దాడుల్లో ఎసిబి సిఐలు రవికుమార్, భాస్కర్, ఎస్ఐలు చిన్నంనాయుడు, శాంతారావు, అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే క్రైమ్‌రేట్ తక్కువ

పోలీస్ వ్యవస్థలో నూతన సంస్కరణలు : స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- కొత్తూరు

పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

దేశంలో పలు రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో క్రైమ్‌రేట్ తక్కువగా ఉందని స్పీకర్ తమ్మినేని సీతారం వెల్లడించారు. గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థలో మహిళా పోలీసుల ఏర్పాటు ద్వారా గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొందన్నారు. శుక్రవారం కొత్తూరు పట్టణంలో రూ.2.50 కోట్లతో నిర్మించిన నూతన పోలీస్‌స్టేషన్ కార్యాలయ భవన సముదాయాన్ని స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిస్థాయిలో అదుపులో ఉన్నాయన్నారు. పోలీస్ వ్యవస్థపై సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారిస్తున్నారని, పలు సంస్కరణలు తీసుకువచ్చేలా కృషి చేస్తున్నారని తెలిపారు. 1861 నాటి పోలీస్ చట్టాలను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరణ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. దిశ చట్టం అమలు ద్వారా రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు తగ్గాయని చెప్పారు. స్త్రీ, శిశు సంక్షేమం పూర్తిస్థాయిలో ఆచరణలోకి రావాలంటే బలమైన పోలీస్ చట్టాలు అమలు కావాల్సి ఉందన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా బాధితులు స్టేషన్‌కు వచ్చి నేరుగా ఫిర్యాదు చేయగలుగుతున్నారని వెల్లడించారు. శిథిలావస్థకు దగ్గరగా ఉన్న స్టేషన్లను గుర్తించి, నూతన భవనాల నిర్మాణాలు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయని చెప్పారు.

కార్యక్రమంలో విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ, ఎస్‌పి జిఆర్ రాధిక, సెబీ జెడి విఎన్ మణికంఠ, అదనపు ఎస్‌పి టిపి విఠలేశ్వర్, డిఎస్‌పిలు డి.బాలచంద్రరెడ్డి, జి.నాగేశ్వరరెడ్డి, పోలీసు హౌసింగ్ ఇఇ తమ్మిరెడ్డి, డిఇఇ వెంకట్ రెడ్డి అసిస్టెంట్ ఇంజినీర్ తరుణ్, సిఐ వేణుగోపాల్, ఎస్ఐ ఎం.గోవింద్, జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, వై.సి.పి.మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, సర్పంచులు సారిపల్లి భారతి, బోర సింహాద్రినాయుడు, ఎం.చక్రపాణి, కె.వైకుంఠరావు, ఎంపిటిసి వి.లక్ష్మీనారాయణ, జి.ఆనందరావు, వై.సి.పి.నాయకులు కుంచాల నూకరాజు, లోతుగెడ్డ తిరుపతిరావు, తోట నందకుమార్, కిరణ్‌కుమార్, పి.కృష్ణారావు, బి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సెలవుల్లో కళాశాలల నిర్వహణ

ఆర్ఐఒకు ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

వేసవి సెలవుల్లో శ్రీచైతన్య, ఎన్ఆర్ఐ, నారాయణ వంటి కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులకు ద్వితీయ ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు తెలిపారు. ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ అధికారి ఎస్.తవిటినాయుడుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. విద్యార్థులపై మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు సెలవులు మంజూరు చేస్తే, అటువంటి సెలవుల్లో సైతం కళాశాలలు నిర్వహించడం దారుణమని తెలిపారు. తరగతుల నిర్వహణ వల్ల విద్యార్థులపై మరింత ఒత్తిడి పెరుగుతోందన్నారు. తక్షణమే తరగతులను నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సంతోష్‌కుమార్, భరణి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న కూన రవికుమార్, టిడిపి నాయకులు

17న ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు

ఆహ్వాన పత్రిక విడుదల చేసిన టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలను టిడిపి శ్రేణులు, జిల్లా ప్రజలు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ కోరారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న ఆయన స్వగృహంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సినీ, రాజకీయ రంగాల్లో ఎన్‌టిఆర్ చెరగని ముద్ర వేశారని, అందరికీ స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. తెలుగువారి వాణిని ప్రపంచదేశాలకు వినిపించిన మహా నాయకుడు ఎన్‌టిఆర్ అన్నారు. ఆయనను స్మరించుకోవడం మనందరి బాధ్యతని చెప్పారు. కుల, మత, పార్టీలకు అతీతంగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేడుకల్లో సీనియర్ టిడిపి నాయకులకు సన్మానాలు చేస్తున్నామన్నారు. జిల్లాలోని సినీ రంగానికి చెందిన ప్రముఖులను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నామని వివరించారు. ఇంటర్, టెన్త్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తామని వెల్లడించారు. 17న మధ్యాహ్నం మూడు గంటల నుంచి టిడిపి జిల్లా కార్యాలయ ప్రాంగణంలో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు.

అనంతరం వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రిక, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, మీడియా సెల్ కన్వీనర్ జామి భీమశంకర్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కొర్ను నాగార్జున ప్రతాప్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె. బాబు, తోణంగి వెంకన్నయాదవ్, నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, సాంస్కృతిక విభాగం అధ్యక్షులు గుత్తు చిన్నారావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, నాయకులు చిట్టి నాగభూషణం, చిట్టి మోహన్, అరవల రవీంద్ర, జి.భాస్కరరావు, వెంకటరామరాజు, భాస్కరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జెవికె పాయింట్ పరిశీలన

ప్రజాశక్తి-టెక్కలి

టెక్కలి జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో ఉన్న జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు వచ్చిన స్టాక్ వివరాలను ఎంఇఒ డి.నాగభూషణాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నోట్‌బుక్‌లు, పుస్తకాలు, డిక్షనరీలు వచ్చాయని, ఇంకా నాలుగు రకాల వస్తువులు రావాలని ఎంఇఒ తెలిపారు. మండలంలోని 89 పాఠశాలల్లో 6050 మంది విద్యార్థులు ఉన్నారని వివరించారు. స్టాక్ పాయింట్ నుంచి గ్రామస్థాయిలో పాఠశాలలకు సరఫరా సక్రమంగా జరగాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళిక తయారు చేసుకోవాలని ఆదేశించారు. స్టాక్ పాయింట్ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి టి.తిరుమల చైతన్య, సమగ్ర శిక్ష ఎపిసి రోణంకి జయప్రకాష్, ఎపిఒ నారాయణరావు, ఎఇ కుప్పిలి గణేష్, ప్రధానోపాధ్యాయులు శోభారాణి, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేందర్

గిరిజనులకు అన్యాయం చేయొద్దు

గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేందర్

ప్రజాశక్తి-మెళియాపుట్టి

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చి గిరిజనులకు ప్రభుత్వం అన్యాయం చేయొద్దని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేందర్ అన్నారు. శుక్రవారం చాపరలోని సిఐటియు కార్యాలయంలో గిరిజన, రైతు, కౌలురైతు సంఘాల నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే అట్టడుగున ఉన్న గిరిజన ఆదివాసీల జీవన పరిస్థితిపై శామ్యూల్ ఆనంద్ కమిషన్ ఇచ్చిన నివేదిక వాస్తవ విరుద్ధమైనదని చెప్పారు. గతంలో ప్రభుత్వం నియమించిన జెసి శర్మ కమిషన్ నివేదికలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు ప్రభుత్వం కక్షగట్టి ఆదివాసీ మనుగడను ప్రశ్నార్థకం చేస్తోందని విమర్శించారు. ఆదివాసీల ఆహారం, కట్టుబాట్లు, పూజలు, భాష, సంస్కృతి వేరన్నారు. బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేరుస్తూ ఏకపక్ష ధోరణితో తీసుకున్న తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సబ్‌ప్లాన్ నిధులు గిరిజనులకే ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనులు పార్టీలకతీతంగా ఐకమత్యంగా ఉండి హక్కుల సాధనకు పోరాటంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం రాష్ట్ర మహాసభ.. జూన్ 8, 9 తేదీల్లో అరకులో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మండంగి లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు నిమ్మక అప్పన్న, కార్యదర్శి ఎస్.ధర్మారావు, జిల్లా నాయకులు బి.రుషి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, జన్ని రామకృష్ణ, బాలరాజు పాల్గొన్నారు.

విఆర్ఒతో మాట్లాడుతున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

భూ రీసర్వే వేగవంతం

సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని చీపుర్లపాడు సచివాలయం పరిధిలో ఉన్న చీపుర్లపాడు, కన్నేవలస పంచాయతీల్లో చేపడుతున్న భూ రీసర్వే పనులను టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. భూ రీసర్వే పూర్తయిన రైతుల నుంచి తంబలు ఎందుకు ఇంకా వేయించలేదని సంబంధిత విఆర్ఒ జబీనను ప్రశ్నించారు. భూ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే కన్నేవలస పంచాయతీలో నిర్వహిస్తున్న భూ రీసర్వేలో భూముల్లో వేస్తున్న హద్దు రాళ్లను పరిశీలించారు. అలాగే చీపుర్లపాడులో ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని పరిశీలించారు. ఈ పాఠశాలకు నాడు-నేడు ద్వారా ఎందుకు మరమ్మత్తు పనులు చేయటం లేదని అధికారులను ప్రశ్నించారు. పనులు చేసేందుకు కాంట్రాక్టులు ముందుకు రావడం లేదని అధికారులు సమాధానమిచ్చారు. పాఠశాల ప్రారంభం నాటికి మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఆర్.మధు, పంచాయతీ కార్యదర్శి బి.నరేష్, సచివాలయ అధికారులు కుటికుప్పల ముకుందరావు, ప్రవీన్ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఎన్నో ఆకర్షణీయ పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మరింత అభివృద్ధికి సాధ్యమవుతుందని జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు అన్నారు. నగరంలోని ప్రయివేటు హోటల్‌లో జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో యువతను పర్యాటక స్థలాలపై అవగాహన కల్పించేందుకు 17 యువ పర్యాటక క్లబ్‌లు స్థాపించామని అన్నారు. వేసవి సెలవుల తరువాత జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లలో యువ క్లబ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. క్లబ్ సభ్యులు గీతాశ్రీకాంత్ మాట్లాడుతూ పర్యాటక రంగం అత్యంత వేగవంతంగా వృద్ధి చెందుతుందన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి వల్ల వ్యాపారాభివృద్ధి చెందుతుందన్నారు. దీంతో ఆయా ప్రాంతాలు, ప్రభుత్వానికి ఆదాయ వనరులు సమకూరుతాయని అన్నారు. అలాగే యువతతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. యువ పర్యాటక క్లబ్‌ల ఏర్పాటు వల్ల జిల్లాలోని పర్యాటక ప్రదేశాలకు విస్తృత ప్రచారం లభిస్తుందన్నారు. ది గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మరింత పర్యాటక అభివృద్ధికి మెండుగా అవకాశాలు ఉన్నాయన్నారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు వావిలాపల్లి జగన్నాథంనాయుడు, డాక్టర్లు అరవింద్, వినోద్, నాగావళి ఆనంద్, సువ్వారి సతీష్ పాల్గొన్నారు.

'ఉపాధి' రక్షణకు పోరాటం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వరమ్మ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో పోరాడి సాధించుకున్న ఆహార భద్రతా చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాపు ఈశ్వరమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాలచం విమర్శించారు. ఉపాధి హామీ రక్షణకు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఈ నెల 8 నుంచి చేపట్టిన ఉపాధి యాత్ర చేపడుతుంది. దీనిలో భాగంగా శ్రీకాకుళం రూరల్ మండలం అలికాం పంచాయతీలోని కరిమిల్లిపేట, కంచుభూమయ్యపేట గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి కూలీలతో శుక్రవారం మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీకి బడ్జెట్‌లో కేటాయింపులను తగ్గించడంతో పాటు నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. ఉపాధి హామీని రక్షించుకునేందుకు ఈ నెల 25న కూలీలతో ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. పేదలకు వేడి నీళ్లకు చలినీలు తోడైనట్లు వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పేదలను కాపాడుతుందని అన్నారు. ఇటువంటి చట్టానికి మరింత నిధులు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో తాగునీరు, పార, గుణపం పదును పెట్టడానికి ఇచ్చే డబ్బులు నిలిపివేయడం సరికాదన్నారు. ఆన్‌లైన్ ఆన్లైన్ మస్టర్లు వేసి పేదలను హింసకు గురి చేస్తున్నారన్నారు. అందువల్ల గతంలో పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకు ఈ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'ఉపాధి' కూలీలతో మాట్లాడుతున్న ఈశ్వరమ్మ

రైతుసంఘాల బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

రైతు సంఘాల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోం దని ఎపిఎం గోవిందరావు అన్నారు. స్థానిక ఎఫ్‌పిఒ కార్యాలయంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే వర్షాకాల సీజన్‌కు రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడి కలిగిన మొక్కలు తక్కువ ధరకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వాసన్ స్వచ్ఛంద సంస్థ 50 శాతం రాయితీతో కొబ్బరి, జీడి, అరటి, మామిడి మొక్కలు అందిస్తుందని అన్నారు. అవసరమైన రైతులకు రాయితీపై వర్మీకంపోస్ట్ కూడా అందిస్తున్నట్టు చెప్పారు. అవసరమైన రైతులు తమ పేర్లు నమోదు చేసుకుంటే నాణ్యమైన మొక్కలు తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. వాసన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి టి.రజిని మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడి కలిగిన ఉద్యాన పంటల మొక్కలు 50 శాతం రాయితీతో అందిస్తున్నామని అన్నారు. అవసరమైన రైతులు తమ పేర్లు నమోదు చేసుకుంటే సకాలంలో వారికి మొక్కలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఒ అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, ఎఫ్‌పిఒ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం గోవిందరావు

జిసి హోంలో తనిఖీలు

నరసన్నపేట : స్థానిక గోఖలే చిల్డ్రన్స్ హోమ్‌ను శుక్రవారం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ యు.శ్రీలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లభిస్తున్న సౌకర్యాలు, వసతి, క్రీడలు, వినోదం వంటి విభిన్న సౌకర్యాలపై చర్చించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ చైల్డ్ ప్రొటెక్షన్ సెంటర్ ఆదేశాలు మేరకు మాసివ్ తనిఖీ నిర్వహిస్తున్నామని తెలిపారు. నరసన్నపేట గోఖలే శిశుసదన్ అందిస్తున్న సేవలపై సంతృప్తి చెందినట్లు పేర్కొన్నారు. జిసి హెమ్ పూర్తి వివరాలను లోకల్ కమిటీ చైర్మన్ సదాశివుని కృష్ణ, హోమ్ వార్డెన్ రవీంద్రనాథ్ సాహులు వివరించారు. కార్యక్రమంలో వి.రమణమూర్తి, ఎం.గడ్డెన్నలు పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న శ్రీలక్ష్మి

డిఎల్‌పిఒగా రమణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారిగా ఐ.వి.రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మందసలో ఇఒపిఆర్‌డిగా పనిచేసిన ఈయన టెక్కలి డిఎల్‌పిఒగా బదిలీ అయ్యారు. డివిజన్ పరిధిలో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణతో పాటు పంచాయతీ సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సహకారంతో, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది సమన్వయంతో పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

రమణ


పుష్పగుచ్ఛం అందజేస్తున్న శివన్నారాయణ

కబడ్డీ పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని బలగ ప్రాంతంలో కొన్నేళ్లుగా ఏటా కబడ్డీ పోటీలు నిర్వహిస్తుండడం ఆనవాయితీ. పల్లి పాపయ్య జ్ఞాపకార్థం శ్రీఉత్తరేశ్వర కబడ్డీ సంఘం ఆధ్వర్యాన శుక్రవారం కబడ్డీ పోటీలను నిర్వహించారు. ముందుగా ఈ పోటీలను వ్యాపార వేత్త రెడ్డి శివన్నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కబడ్డీలో జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలను సాధించిన చరిత్ర జిల్లాకు ఉందన్నారు. క్రీడాకారులను తీర్చిదిద్దడంలో సంఘం కృషి ఎంతో ఉందన్నారు. యువతకు క్రీడలపై ఆసక్తి పెంచడానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ పోటీల్లో జిల్లాస్థాయి నుంచి 14 జట్లు పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి చిరంజీవులు, చిట్టి రాము, చిట్టి నాగేశ్వరరావు, చిట్టి శ్రీను, తంగి చిన్నారావు పాల్గొన్నారు.

కనులవిందుగా కలశ పూజ

కవిటి: మండలంలోని కుసుంపురం గ్రామంలో ఐదు రోజులపాటు నిర్వహించనున్న హరే రామ హరే కృష్ణ మహానామ యజ్ఞం శుక్రవారం సాయంత్రం వైభవోపేతంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మహిళలు సముద్రం వద్దకు చేరుకుని పూజలు నిర్వహించారు. సముద్ర జలాలను తీసుకొచ్చి, యజ్ఞం తలపెట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

దరఖాస్తులకు ఆహ్వానం

టెక్కలి : టెక్కలి ఐసిడిఎస్ కార్యాలయం పరిధిలో పలు అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్తల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని పిఒ శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి 19 వరకు వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని అన్నారు. మండలంలోని పాతనౌపడ, పెద్దరోకళ్లపల్లి, భగీరథపేట, సంతబొమ్మాళి మండలం ఎస్.బి.కొత్తూరు, ఆకాశలక్కవరం, పాతనాయుడుపేట, అంట్లవరం అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని పలు గ్రామాల్లో రానున్న ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయశాఖాధికారులు సన్నద్ధం కావాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పినకాన వైకుంఠరావు కోరారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌కు అనుగుణంగా రైతులకు సరిపోయే విధంగా విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. మండలంలో పదిహేడు సిహెచ్‌ఎస్ గ్రూపులు ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో వ్యవసాయశాఖాధికారులు, ఎఎంఒ రంగారావు, ఆర్‌బికె చైర్మన్లు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన

పొందూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన అందిస్తున్నట్లు పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎ.ఉమామహేశ్వరి, కె,నాగరాజులు పేర్కొన్నారు. పొందూరు మండలం రాపాకలోని విద్యార్థులను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరాలని శుక్రవారం తల్లిదండ్రులను కోరారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సదుపాయాలను, సౌకర్యాలను, ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించారు.

భూ రీసర్వే ప్రారంభం

ప్రజాశక్తి- బూర్జ

రైతుల దశాబ్దకాలం నాటి కల సిఎం జగన్మోహన్‌రెడ్డి నెరవేర్చారని జెడ్‌పిటిసి బి.రామారావు అన్నారు. మండలంలోని తుడ్డలి, హరిపురం, మర్రిపాడు గ్రామాల్లో భూ రీ సర్వే పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో గ్రామాల్లో వేల తరబడి భూముల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రతి సెంటు భూమినీ రీ సర్వే చేసి రైతులకు భూ హక్కు పత్రాలను అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో పిపి ప్రతినిధి కె.నాగేశ్వరరావు, లక్కుపురం సర్పంచ్ వి.కష్ణ, రెవెన్యూ అధికారులు రమేష్ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు అందని ఆహ్వానం

ప్రభుత్వ కార్యక్రమాలకు రెవెన్యూ అధికారులు ఆహ్వానించడం లేదని సర్పంచ్ అంపిలి రూపవతి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు చేత గెలిచిన మమ్మల్ని రెవెన్యూ అధికారులు తరచూ అవమానపరుస్తున్నారని అన్నారు. ఇదే విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

సమీక్షిస్తున్న డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్

పోలాకి: స్వయం సహాయక సంఘాలతో నడుపుతున్న ప్రతి గ్రామ సంఘమూ ఎ గ్రేడ్‌లో ఉండేటట్లు చూసుకోవాలని డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ విద్యాసాగర్ ఆదేశించారు. మండలంలోని చీడివలస పంచాయతీ జిల్లెడివలస గ్రామ సంఘ సభ్యులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషల్ మొబైలైజేషన్ గురించి స్వయంశక్తి సహాయక సంఘాలకు అప్పజెప్పిన పనులన్నీ జూన్ 30 లోగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామ సంఘంలోని గ్రూపులన్నీ రుణాలు తీసుకుని సక్రమంగా తిరిగి చెల్లించి ఏ గ్రేడ్‌లో ఉండేటట్లు చూసుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ గ్రూప్‌లో చేర్చాలన్నారు. ప్రతి కుటుంబానికీ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు మంజూరు చేయాలన్నారు. నిలిచిపోయిన సంఘాలను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎసి కొండలరావు, ఎపిఎం జి.రాజారావు, సిసి బి.రవికుమార్, మండల మహిళా అధ్యక్షులు కె.అరుణకుమారి, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంప పెట్టు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైసిపి ప్రభుత్వం ప్రజల గొంతు నొక్కేందుకు తీసుకొచ్చిన జిఒ నంబరు 1ను నిలుపుదల చేస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంప పెట్టులాంటిదని శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వ్యాఖ్యానించారు. అరసవల్లిలోని ఆమె స్వగృహంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జిఒ నంబరు 1 అమలు వల్ల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లే ప్రమాదాన్ని హైకోర్టు గుర్తించి తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజాదరణ ఉన్న చంద్రబాబు, లోకేష్, పవన్ ఇతర రాజకీయ పార్టీల సభలకు, ఉద్యోగుల నిరసనలను అడ్డుకునేందుకు జగన్ ప్రభుత్వం ఎక్కడికక్కడ నిలుపుదల చేసే ధోరణిలో నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. పోలీసు చర్యలను ప్రోత్సహించేందుకు జిఒ నంబరు 1 తీసుకొచ్చారని అన్నారు. జిఒ నంబరు 1 అనుసరించి రోడ్ షోలను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. గతంలో తమ అధినేత చంద్రబాబు రోడ్ షోను కుప్పంలో జిఒ నంబరు 1 సాకుతో అడ్డుకున్నారని గుర్తుచేశారు. రాజ్యాంగం కల్పించిన 19,20,21 అధికరణల ప్రకారం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు తావిచ్చేవిధంగా ఉన్న జిఒ నంబరు 1ని రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

పలాస : జిఒ నంబరు 1 రద్దు ద్వారా న్యాయం గెలిచిందని మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర శివాజీ అన్నారు. పలాసలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయని జగన్మోహన్‌రెడ్డి జిఒ నంబరు ఒకటి తీసుకువచ్చారని అన్నారు. చంద్రబాబు నాయుడు, లోకేష్ రోడ్ షోలకు పాదయాత్రలకు జనం స్వచ్ఛందంగా తరలిరావడంతో వాస్తవాలు బయటకు వస్తాయని అక్కసుతో ఈ జిఒను తీసుకొచ్చారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య స్వేచ్ఛను హరించే జిఒ నంబరు 1ను రద్దు చేయడం శుభపరిణామమని అన్నారు.

టెక్కలి : జిఒ నంబరు 1ను హైకోర్టు నిలిపివేతపై నిర్వహించిన సమావేశంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, రెయ్యి ప్రీతీష్ చంద్, దల్లి ప్రసాద్‌రెడ్డి, మళ్లా బాలకృష్ణ, సోడిమూడి కిరణ్, అబిలాష్, ప్రుల్లా పోరిడా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఇ రామినాయుడు

తాత్కాలిక రోడ్డు పనులు వేగవంతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కూలిన బాహుదా వంతెనపై తాత్కాలిక మార్గం పనులు వేగవంతానికి కృషి చేస్తున్నామని రోడ్ల, భవనాల శాఖ డిఇఇ రామినాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. తాత్కాలిక మార్గం పనులకు కలెక్టర్ రూ.40 లక్షలు మంజూరు చేశారని, దానికి పరిపాలనా ఆమోదం లభించినట్లు పేర్కొన్నారు. త్వరలో టెండర్లను పిలిచి మరో రెండు వారాల్లో బాహుదా నదిపై తాత్కాలిక మార్గం పనులను ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కె.మోహనరావు, జెడ్‌పిటిసి ప్రతినిధి ఉప్పాడ రాజారెడ్డి, చిట్టిబాబు, దీనబంధు పాల్గొన్నారు.

నేడు పి.జె.పురంలో గడపగడపకు

వజ్రపుకొత్తూరు : మండలంలోని పూడిజగన్నాథపురంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నామని వైసిపి మండల అధ్యక్షులు పి.గురయ్యానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు ఎలా అందుతున్నాయో? తెలుసుకోవడం గడప గడపకు మన ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొవాలని కోరారు.

మార్కెట్లోకి సూపర్ స్ప్లెండర్ ఎక్స్‌టెక్ 125 సిసి

శ్రీకాకుళం : నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి వద్ద ఉన్న వరం ఆటో సెంటర్‌లో షోరూమ్‌లో సూపర్ స్ప్లెండర్ ఎక్స్‌టెక్ 125 సిసి శుక్రవారం ప్రారంభించారు. బైక్ ప్రత్యేకతలు బ్లూటూత్ కనెక్టివిటీ కాల్ ఎస్ఎంఎస్ అలర్ట్, పూర్తిగా స్పీడోమీటర్ యుఎస్‌బి మొబైల్ చార్జింగ్ 3ఎస్ టెక్నాలజీ, రియల్ టైం మైలేజ్ ఇండికేటర్ కిలోమీటర్ స్పీడ్‌తో వెళ్తుందని ఎండీ అంథవరపు ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మెట్ట గోవిందరావు, బొడ్డేపల్లి క్రాంతికుమార్, డిఎస్ ఎం.ఎం.శ్రీనివాస్, అకౌంట్స్ మేనేజర్ ఎం.వెంకటరావు పాల్గొన్నారు. కోటబొమ్మాళికి చెందిన సిహెచ్.వెంకటరావు మొదటి కొనుగోలు చేశారు.

నమూనాను కీని అందజేస్తున్న ప్రసాద్

వరి విత్తనాలు సిద్ధం చేయాలి

నందిగాం: రైతులకు ఖరీఫ్‌కు అవసరమైన వరి విత్తనాలు, యూరియా, డిఎపి సిద్ధం చేయాలని ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి వ్యవసాయాధికారి శ్రీకాంత్‌శర్మకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సమావేశంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ తిలక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా సభ్యులు పలు ప్రశ్నలు వేశారు. ఉపాధి హామీ ద్వారా ఎకరాకు తగ్గకుండా పొలంలో కొబ్బరి చెట్లు వేసుకోవాలని, మూడేళ్ల పాటు మెయింటెన్స్ నిధులు ప్రభుత్వం అందజేస్తుందని ఎపిఒ నాగరాజు తెలిపారు. లకితాపురం, పెద్దలోనపల్లి, కర్లపూడి, పెద్ద తామరపల్లి జగనన్న లేవుట్లలో సౌకర్యం కల్పించలేదని, దీంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారని ఎస్.లావణ్య, నడిపూరు భానుమతి, పూడి ఉషారాణిలు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనబందిపురం సర్పంచ్ మండపాలు సంజీవరావు మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఎఎన్ఎం పోస్టు ఖాళీగా ఉండటంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ మధుల, ఇంజినీరింగ్ అధికారి సంతోష్‌కుమార్, ఎంపిడిఒ హెచ్.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తిలక్

సంక్షిప్త వార్తలు

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

టెక్కలి : ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో నిర్వహిస్తున్న వివిధ రకాల కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 23-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి కళాశాల కార్యాలయంలో మల్లేశ్వరరావుని సంప్రదించాలని కోరారు. కళాశాల్లో అధునాతనమైన కోర్సులు ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడిన నేపథ్యంలో డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

15న 'జగనన్నకు చెబుదాం'

టెక్కలి : హిరమండలం మండలం అవలింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 15న ఉదయం పది గంటలకు జగనన్నకి చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నామని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

టెక్కలి రెవెన్యూ సబ్ డివిజన్ పరిధిని పలు మండలాల్లో హుదూద్ తుపాను సందర్భంగా ఇళ్లు కోల్పోయిన బాధితులు వారం రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని సబ్ కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పథకంలో ఇంటిని మంజూరు కాని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

15లోగా ఇకెవైసి చేసుకోవాలి

పొందూరు : రాష్ట్ర ఖజానా, గణాంక శాఖ డైరెక్టర్ ఆదేశాలు మేరకు ప్రభుత్వ పింఛనుదారులు, కుటుంబ పింఛనుదారులు ఈ నెల 15లోగా ఇకెవైసి చేయించుకోవాలని స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అంకం ధర్మారావు, పాలిశెట్టి సూర్యప్రకాశరావులు ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా పింఛనుదారులు తమ ఆధార్‌కార్డు, లింకైన ఫోన్ నంబరు, పిపిఒ నంబరును స్థానిక ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నీటి తొట్టెల పరిశీలన

బూర్జ: మండలంలోని జగన్నాథపురం, మదనాపురం, గిరాడపేట, పెద్దపేట, కొండపేట గ్రామాల్లో హెచ్.వి.లక్ష్మీబాయి ఆధ్వర్యాన శుక్రవారం నీటి తొట్టిలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి తొట్టెలను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకొని బీజింగ్ వేయాలని సూచించారు. ఈమెతో పాటు ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి అవగాహన చేశారు.

బాల్య స్నేహితుల ఆత్మీయ కలయిక

ఇచ్ఛాపురం: స్థానిక సురంగి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకుని, అంచెలంచెలుగా ఎదిగి వివిధ వృత్తుల్లో స్థిరపడిన స్నేహితులు అంతా ఒక్క చోట చేరి ఆ పాత మధురాలు నెమరువేసుకుంటూ జీవిత అనుభవాలు పరస్పరం పంచుకున్నారు. స్థానిక మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. దాదాపు 30 ఏళ్ల తరువాత అంతా ఒక్కటిగా పలు తీర్మానాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సదాశివుని శ్రీనివాస్, డాక్టర్ పాతిర్ల దేవేంద్ర, డాక్టర్ నందిక శ్రీనివాస్, మల్లా నాగేశ్వరరావు, బత్తిన నాగరాజ్, ఎస్.శ్రీహరి, పిలక కళ్యాణ్, నాగరాజ్ పాత్రో, పి.ఆదినారాయణ, ప్రభాకర్ బెహరా, గుజ్జు జగన్నాథ్ పాల్గొన్నారు.

ఆత్మీయ కలయికలో పాల్గొన్న బాల్య స్నేహితులు

మహిళా రైతులకు మైక్రో క్రెడిట్ రుణాలు

మాట్లాడుతున్న మేనేజర్ లావణ్య

ఆమదాలవలస: రైతు ఉత్పత్తిదారుల సంఘాలలో సభ్యులైన మహిళా రైతులకు మైక్రో క్రెడిట్ రుణాలను తక్కువ వడ్డీకి మంజూరు చేస్తున్నట్లు డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ పి.లావణ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మండల మహిళా సమాఖ్యలో వైకెపి ఎపిడి పైడి కూర్మారావు ఆధ్వర్యంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలలో పంచ సూత్రాలు పాటిస్తున్న సభ్యులను గుర్తించి, వారి ఆదాయాభివృద్ధి కార్యక్రమాల కోసం అవసరమైన రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఎపిఎం కూర్మారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో చిరుధాన్యాల ఉత్పత్తిదారులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి, అకౌంటెంట్ కళ్యాణి, డేటాఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

వికలాంగుల శాఖ ఎడిగా కవిత

శ్రీకాకుళ అర్బన్ : జిల్లా వికలాంగుల శాఖ ఎడిగా కవితను ప్రభుత్వం నియమించింది. శుక్రవారం ఆమె జిల్లా కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి- సోంపేట

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నిమ్మాన దాసు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. అర్హులందరికీ జాబ్‌కార్డులు అందజేసి ఉపాధి పనులు కల్పించాలని ఎంపిటిసిలు, సర్పంచ్‌లు ఎపిఒను కోరారు. గ్రామాల్లో రోడ్ల సదుపాయాలు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని, పక్కాగా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బి ఎఇని కోరారు. ప్రధాన సమస్యలపై ఎంపిటిసిలు, సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకు రాకపోవడంతో సమావేశం ముగిసింది. కార్యక్రమంలో జెడ్‌పిటిసి తడక యశోద, వైస్ ఎంపిపి జి.శ్రీనివాస్, ఎంపిడిఒ వెంకటరమణ, తహశీల్దార్ జి.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి దాసు

ఆకట్టుకున్న సైకత రథం

ఇచ్ఛాపురం గ్రామ దేవత శ్రీస్వేచ్ఛావతి అమ్మవారు ఉత్సవాల సందర్భంగా కండర వీధిలో స్థానికులు ఏర్పాటు చేస్తున్న సైకత రథాలు అందరినీ ఆకట్టుకుంది. ప్రతి రెండు రోజులకొకసారి ఇసుకతో తయారు చేస్తున్న వివిధ ఆకృతల్లో గ్రామ దేవత రథాలు విశేషంగా ఆకటుకున్నాయి. సంబరాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇంకా కేవలం మూడు రోజులు మాత్రమే ఉండడంతో రోజురోజుకీ యాత్రికుల తాకిడి పెరుగుతుంది. పట్టణంలో సాయంత్రం నుంచి అర్ధరాత్రి 12 గంటల రథాల సైకత శిల్పాలను తిలకించేందుకు తరలివస్తున్నారు.

- ప్రజాశక్తి, ఇచ్ఛాపురం